సాక్షి
నాగర్‌కర్నూల్
మంగళవారం : 21 : మే : 2024



బ్రహ్మోత్సవాలకు ముస్తాబు

బీచుపల్లి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి.

వివరాలు 8లో ▸



ఒక్కరోజే దర్శన'యోగం'

అలంపూర్‌లోని యోగనారసింహుడి దర్శనభాగ్యం భక్తులకు దక్కడం లేదు.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
40.0 /22.7

వాతావరణం

రోజులో ఎక్కువ భాగం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం మోస్తరు నుంచి భారీవర్షం కురిసే అవకాశం ఉంది.

పక్కా ప్రణాళిక

4.73 లక్షల ఎకరాల్లో వానాకాలం సాగు అంచనా



మంతటిలో వానాకాలం సాగుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

- అత్యధికంగా వరి, పత్తిసాగయ్యే అవకాశం
- రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత తలెత్తకుండా అధికారుల చర్యలు
- అందుబాటులో 23,569 మెట్రిక్ టన్నుల ఎరువులు
- ఇంకా 1.30 లక్షల మెట్రిక్ టన్నులు అవసరం

నాగర్‌కర్నూల్/అచ్చంపేట: జిల్లాలో యాసంగి పంట కోతలు ముగుస్తున్న క్రమంలో రైతులు వానాకాలం సాగుకు సన్నద్ధమవుతున్నారు. యాసంగి చివరలో కేఎల్‌ఐ నీళ్లు నిలిచిపోవడంతో వందలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులకు నష్టం వాటిల్లింది. ఈనేపథ్యంలో వచ్చే వానాకాలంలో అయినా మంచి దిగుబడి సాధించాలనే ఆలోచనలో రైతులు ఉన్నారు. అందుకు అనుగుణంగా జిల్లా వ్యవసాయ శాఖ పక్కా ప్రణాళికను రూపొందించింది. వానాకాలంలో పంటసాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది.

రాయితీపై విత్తనాలు..

అధిక విస్తీర్ణంలో సాగయ్యే పత్తి విత్తనాలు మినహా ఇతర విత్తనాలను ప్రభుత్వం రాయితీపై అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. పత్తి విత్తన ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ప్రైవేటు డీలర్లను ఆదేశించింది. పత్తి తర్వాత ఎక్కువగా సాగయ్యే వరి, కంది, మొక్కజొన్న విత్తనాలను రాయితీపై అందించే అవకాశం ఉంది. పెసర, జొన్న, మినుములు ఇతర పంటల విత్తనాలు, సేంద్రియ ఎరువుగా వినియోగించే జీలుగ, జనుము విత్తనాలు 50 వేల క్వింటాళ్ల వరకు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు.

ఎలాంటి కొరత లేకుండా..

వానాకాలం సాగుకు అనుగుణంగా విత్తనాలు, ఎరువుల కోసం జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ఎరువుల విషయానికి వస్తే.. జిల్లాకు 1,30,754 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమవుతాయని అంచనా వేశారు. యూరియా 53,475 మెట్రిక్ టన్నులు అవసరం ఉండగా.. ప్రస్తుతం 16,015 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంది. డీఏపీ 18,085 మెట్రిక్ టన్నులకుగాను 1,914, ఎస్‌ఎస్‌పీ 1,862 మెట్రిక్ టన్నులకుగాను 275, ఎంఓపీ 3,351 మెట్రిక్ టన్నులకుగాను 243, కాంప్లెక్స్ ఎరువులు 53,981 మెట్రిక్ టన్నులకుగాను 5,122 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయి. అయితే రైతులకు ఎరువులు అవసరమయ్యే వరకు నెలవారీ కోటా వస్తుందని అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా 9,02,680 క్వింటాళ్ల విత్తనాలు అవసరం ఉన్నట్లు నివేదిక సమర్పించినట్లు పేర్కొంటున్నారు.

పంటల సాగు వివరాలు (ఎకరాల్లో)..

పత్తి	వరి
2,73720	1,40,082

కందులు	మొక్కజొన్న	జొన్న
3,755	45,237	3,442

మినుములు	ఆముదం	వేరుశనగ
747	294	847

ఇతర పంటలు:	హార్టికల్చర్:
5,636	57,349

విత్తనాల అవసరం అంచనా (క్వింటాళ్లలో)..

పత్తి	వరి
8,55,540	35,020.50

కందులు	జొన్న	ఆముదం
112.65	137.68	5.88

మొక్కజొన్న	మినుములు
11,309.25	59.76

వేరుశనగ	ఇతర పంటలు
484.8	10.055

పెరగనున్న సాగు విస్తీర్ణం..

గతేడాది వానాకాలంలో 4,41,247 ఎకరాల్లో పంటసాగు కాగా.. ఈఏడాది అదనంగా 33,911 ఎకరాల్లో సాగుచేస్తారని అంచనా వేశారు. జిల్లావ్యాప్తంగా సుమారు 4,73,760 ఎకరాలు సాగు అవుతుందని వ్యవసాయాధికారులు ప్రణాళిక రూపొందించి, ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. అందులో అత్యధికంగా పత్తి, వరిపంట సాగయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ మేరకు పత్తిసాగు విస్తీర్ణాన్ని పెంచేలా ప్రభుత్వం సూచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక హార్టికల్చర్‌కు సంబంధించి మరో 57,349 ఎకరాల్లో వివిధ తోటలు సాగయ్యే అవకాశం ఉందని ప్రణాళిక సిద్ధంచేశారు. ఈమేరకు రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

జూన్‌లో చల్లని కబురు..

జూన్ మొదటి వారంలో రుతుపవనాల రాకతో పాటు సాధారణ వర్షపాతం కంటే అధికంగా నమోదయ్యే అవకాశం ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు చెబుతుండటం రైతులకు చల్లని కబురుగా చెప్పవచ్చు. గతేడాది వానాకాలం ప్రారంభంలో ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో జూలైలో కురిసిన వర్షాలకు విత్తనాలు వేసుకున్నారు. ఈనెల ప్రారంభంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలకు చేరుకోవడంతో వేసవి దుక్కులు రాక రైతులు నిరాశ చెందారు. గత వారం రోజులుగా అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురుస్తుండటంతో దుక్కులు దున్నుకుంటున్నారు. చల్లబడ్డ వాతావరణంతో పొలంబాట పడుతున్నారు. తొలకరి వర్షాలు వచ్చేలోగా పంట పొలాలను సిద్ధం చేసుకునేందుకు రైతులు నడుం బిగించారు.

ప్రణాళికా బద్ధంగా ముందుకు..

వానాకాలం సాగుకు సంబంధించి ఇప్పటికే ప్రణాళికను సిద్ధంచేశాం. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచుతాం. జిల్లాకు 920 క్వింటాళ్ల పచ్చరొట్ట విత్తనాలు కేటాయించారు. 60 శాతం సబ్సిడీపై రైతులకు అందజేస్తారు. అవసరమున్న రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– చంద్రశేఖర్, డీఏఓ

గ్రామాల వనరులపై కేంద్ర బృందం అధ్యయనం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కుమార్ దీపక్

నాగర్‌కర్నూల్: కేంద్ర సెక్రెటరియేట్ పరిధిలోని వివిధ శాఖల అసిస్టెంట్ సెక్షన్ అధికారులు జిల్లాలోని 5 గ్రామాల్లో స్థితిగతులు, వనరులపై అధ్యయనం చేస్తారని అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కేంద్ర ప్రభుత్వ శిక్షణ అధికారుల బృందం పర్యటనపై కేంద్ర బృందం, జిల్లా అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వివిధ శాఖల మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో పనిచేసే అసిస్టెంట్ సెక్షన్ అధికారులు జిల్లాలోని నాలుగు మండలాల పరిధిలో ఎంపిక చేసిన ఐదు గ్రామాలను సందర్శించి.. గ్రామీణ ఆర్థిక, సామాజిక స్థితిగతులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలను పరిశీలించి మండల, గ్రామస్థాయి అధికారులతో సమావేశమై పలు అంశాలపై అధ్యయనం చేస్తారన్నారు. రాష్ట్రంలోని గ్రామాల్లో స్వచ్ఛ భారత్ ద్వారా చేపట్టిన అభివృద్ధి, వివిధ అంశాల వారీగా చేపట్టిన పనులను అదనపు కలెక్టర్ బృందాల సభ్యులకు వివరించారు. కేంద్ర పరిశోధన బృందం హన్మంతు నాయకత్వంలో 5 మంది సభ్యులతో కూడిన 5 బృందాల ద్వారా 26 మంది కేంద్ర ప్రభుత్వ పరిధిలోని వివిధ శాఖలకు చెందిన అసిస్టెంట్ సెక్షన్ అధికారులు శిక్షణ నిమిత్తం జిల్లాలోని ఆయా గ్రామాలను సందర్శిస్తారని చెప్పారు. చందుపట్ల, గన్యాగుల, అల్లాపూర్, బిజినేపల్లి, తెలకపల్లి గ్రామాలను ఎంపిక చేసి ప్రతి గ్రామానికి ఐదు మంది అధికారులను ఐదు రోజులపాటు సోమవారం నుంచి శుక్రవారం వరకు సందర్శించడానికి అధికారులు కావాల్సిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌డీఓ చిన్న ఓబులేసు, డీపీఓ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తెలకపల్లికి శిక్షణ ఐఏఎస్‌ల బృందం



ఐఏఎస్‌ల బృందంతో సమావేశమైన ఎంపీడీఓ కృష్ణయ్య

తెలకపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను పరిశీలించడానికి ఐఏఎస్‌ల బృందం సోమవారం తెలకపల్లికి చేరుకుంది. స్థానిక మేజర్ గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఐఏఎస్‌ల బృందం ఎంపీడీఓ కృష్ణయ్యతో సమావేశమయ్యారు. మండలానికి స్టడీ టూర్ నిమిత్తం ఆరుగురు శిక్షణ ఐఏఎస్‌ల బృందం సభ్యులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు అభివృద్ధి పనులపై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారని, వారికి అన్ని రకాల వివరాలు అందించాలని ఎంపీడీఓ తెలిపారు. సమావేశంలో ఎంపీఓ వెంకటయ్య, తెలకపల్లి ఈఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేటలో భారీ వర్షం



నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను పరిశీలిస్తున్న అధికారులు

అచ్చంపేట రూరల్: పట్టణంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాల కాలనీల్లోని ఇళ్లకు, దుకాణాల్లోకి నీళ్లు చేరాయి. బస్టాండు నుంచి నాగర్‌కర్నూల్ వెళ్లే దారి పెద్ద చెరువును తలపించింది. దీంతో గంటల పాటు రాకపోకలకు అంతరాయం కలిగింది. అలాగే ఉప్పునుంతల రోడ్డు బీఎస్‌ఎన్‌ఎల్ టవర్ సమీపంలో కల్వర్టు వద్ద భారీ వరద నీరు ప్రవహించడంతో అటుగా వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మల్లకుంట వద్ద నీరు రోడ్డుపైకి వచ్చింది. కురిసిన భారీ వర్షానికి అచ్చంపేట అతలాకుతలమైంది. చాలా కాలనీల్లోకి వరద నీరు రావడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగి అంధకారం ఏర్పడింది. విద్యుత్ అధికారులు మరమ్మతు చేపడుతున్నారు.

న్యూస్‌రీల్

ఫిర్యాదులు పరిష్కరించాలి



నాగర్‌కర్నూల్ క్రైం: పోలీస్‌స్టేషన్లకు వచ్చే ఫిర్యాదులు త్వరగా పరిష్కరించేందుకు సిబ్బంది కృషిచేయాలని ఏఎస్పీ రామేశ్వర్ అన్నారు. సోమవారం ఏఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ ప్రజావాణికి 4 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్ ప్రజావాణికి న్యాయం చేయాలని ఒకటి, భూమి పంచాయతీ గురించి మూడు ఫిర్యాదులు వచ్చినట్లు వివరించారు.

కల్తీ ఆహార పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు



నాగర్‌కర్నూల్ క్రైం: హోటళ్లు, సూపర్ మార్కెట్లలో కల్తీ ఆహార పదార్థాలు విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారి మనోజ్‌కుమార్ అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని పలు హోటళ్లు, సూపర్ మార్కెట్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోటళ్లు, సూపర్ మార్కెట్లలో శాంపిళ్లు సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపిస్తామన్నారు. ఎక్కడైనా నాణ్యత లేని వస్తువులు, ఆహార పదార్థాలు విక్రయిస్తే ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం జిల్లాకేంద్రంలోని బస్టాండ్ ఎదుట విక్రయిస్తున్న మామిడి పండ్ల వ్యాపారుల వద్ద మామిడి పండ్లను పరిశీలించి.. త్వరగా మాగేందుకు రసాయన పదార్థాలు వాడొద్దని సూచించారు.

నేడు అవగాహన సదస్సు

కొల్లాపూర్: మామిడి సాగు, పంట ఎగుమతులు, పంట కోత తర్వాత తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం జిల్లాకేంద్రంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు కొల్లాపూర్ ఉద్యాన శాఖ అధికారి లక్ష్మణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఈడీఏ, ఉద్యానశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సులో శాస్త్రవేత్తలు, నాబార్డు అధికారులు మాట్లాడతారన్నారు. కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్‌లో నిర్వహించే సదస్సుకు మామిడి రైతులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



నాగర్‌కర్నూల్ క్రైం: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా సైబర్ నేరగాళ్ల వల్ల మోసపోతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సైబర్ క్రైం డీఎస్పీ గిరికుమార్ అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని ఎస్పీ కార్యాలయ సమావేశ మందిరంలో సైబర్ క్రైం బాధితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల చేతుల్లో మోసపోకుండా ఫ్రీజ్ అయిన నగదును త్వరలోనే లోక్ అదాలత్ ద్వారా బాధితుల అకౌంట్లలో రీఫండ్ చేస్తామన్నారు. ప్రతిఒక్కరు సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. సమావేశంలో ఎస్‌ఐ గోవర్ధన్, రవికుమార్ పాల్గొన్నారు.

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో



ధరూరు: ఉమ్మడి పాలమూరులోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి స్వల్ప ఇన్‌ఫ్లో వస్తుందని అధికారులు తెలిపారు. స్థానికంగా కురుస్తున్న వర్షాలతో పాటు ఎగువన ఉన్న నారాయణపూర్ నుంచి వస్తున్న స్వల్ప ఇన్‌ఫ్లోతో ప్రాజెక్టు జలకళ సంతరించుకుంటోంది. సోమవారం జూరాల ప్రాజెక్టుకు 1,998 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చిందని అధికారులు చెప్పారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 3.709 టీఎంసీల నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు. ప్రాజెక్టు నుంచి 133 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు వివరించారు.

కొత్త వీసీ ఎప్పుడో..?!



నేటితో ముగిసిన పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ పదవీకాలం

- 2021 మే 21న మూడేళ్ల కాలానికి నియామకం
- ఫిబ్రవరిలోనే ముగిసిన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ పదవీకాలం
- కీలకంగా మారిన వీసీ, ఈసీ రెండు నియామకాలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ పదవీకాలం మంగళవారంతో ముగియనుంది. 2021 మే 21న ఆయన్ను వీసీగా మూడేళ్ల పదవీ కాలానికి వీసీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. మంగళవారంతో ఆయన పదవీకాలం ముగియనుండటంతో వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ ఉస్మానియా యూనివర్సిటీకి తిరిగి వెళ్లనున్నారు. ఈ క్రమంలో కొత్త వీసీ ఎవరిని నియమిస్తారనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. గత నాలుగు నెలల క్రితమే ప్రభుత్వం వీసీల నియామకానికి నోటిఫికేషన్ ఇచ్చింది. ఇలా వచ్చిన దరఖాస్తులపై సెర్చ్ కమిటీ పరిశీలన ఇంకా పూర్తి కాలేదని తెలుస్తుంది. అంతేకాకుండా ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున వీసీల నియామకం ఆలస్యమవుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే కొత్త వీసీలను నియమించే వరకు ఇప్పుడు ఉన్న వైస్ చాన్స్‌లర్‌నే మరికొన్ని రోజులు పొడిగించే అవకాశం ఉన్నట్లు యూనివర్సిటీ వర్గాల్లో చర్చ జరుగుతుంది. ఇదిలా ఉండగా.. రాష్ట్రంలో ఏ యూనివర్సిటీకి ఇవ్వనన్ని నిధులను కేంద్ర ప్రభుత్వం రూ.100 కోట్ల బడ్జెట్‌ను కేటాయించింది. దీంతో రాష్ట్రంలోనే పీయూ వీసీ పోస్టుకు పోటీ పెరిగినట్లు తెలుస్తుంది.

పరిపాలన వ్యవహారాల్లో..

పీయూ ఎగ్జిక్యూటివ్ కమిటీ పదవీకాలం ఫిబ్రవరిలో ముగిసింది. ఈ కమిటీ 2020 ఫిబ్రవరిలో మూడేళ్ల పరిమితితో నియామకమైంది. 2023 ఫిబ్రవరిలో పదవీకాలం ముగియగా ప్రభుత్వం మరో ఏడాదిపాటు పొడిగించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో గడువు తీరిపోయింది. దీంతో 8 మంది సభ్యులు బాధ్యతల నుంచి తప్పుకున్నారు. ఇక నలుగురు ఎక్స్‌అఫీషియో సభ్యులుగా వీసీ, రిజిస్ట్రార్, సీనియర్ ప్రొఫెసర్, విద్యా శాఖ కార్యదర్శి కొనసాగుతున్నారు. యూనివర్సిటీలో పరిపాలన పరమైన అనుమతుల కోసం వైస్ చాన్స్‌లర్‌తోపాటు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ కూడా ఎంతో కీలకం కానుంది.

ప్రచారంలో ముగ్గురి పేర్లు

వీసీల నియామకం కోసం దరఖాస్తులు చాలానే వచ్చినట్లు తెలుస్తుంది. ఇందులో అడ్మినిస్ట్రేషన్‌లో సుదీర్ఘ అనుభవం, అకాడమిక్‌లో ప్రొఫెసర్ స్థాయి సీనియార్టీ ఉండే వారిని నియమిస్తారు. అంతేకాకుండా రిజర్వేషన్లు కీలకంగా మారనున్నాయి. మొదట ఓసీ కేటగిరిలో వీసీగాలు గోపాల్‌రెడ్డి, కట్టా నర్సింహారెడ్డికి అవకాశం వచ్చింది. తర్వాత బీసీ కేటగిరిలో భాగ్యనారాయణ, ఎస్టీ కేటగిరిలో రాజారత్నం, లక్ష్మీకాంత్ రాథోడ్ పనిచేశారు. రొటేషన్ పద్ధతిలో మరోసారి ఓసీ కేటగిరికి చెందిన వారికి అవకాశం ఇస్తారని, లేదా ఇప్పటి వరకు అవకాశం దక్కని ఎస్సీ కేటగిరి వారికి ఇస్తారనే చర్చ జరుగుతుంది. ఈ క్రమంలోనే పాలమూరు యూనివర్సిటీ వీసీ నియామకంలో ముగ్గురు ప్రొఫెసర్ల పేర్లు వినిపిస్తున్నాయి. గతంలో ఇక్కడ రిజిస్ట్రార్‌గా పనిచేసిన ఓ వ్యక్తి పేరు ప్రముఖంగా వినిపించడం గమనార్హం.

పాఠశాలలకు మహర్దశ

పీఎంశ్రీ కింద మరో 46 స్కూళ్ల ఎంపిక

- రెండో జాబితా విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం
- ఏడాదికి రూ.40 లక్షల చొప్పున ఐదేళ్లపాటు విడుదల
- సమగ్ర అభివృద్ధికి దోహదపడనున్న నిధులు
- ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్న విద్యాశాఖ



పీఎంశ్రీ పథకానికి ఎంపికైన కోడేరు మోడల్ స్కూల్

నాగర్‌కర్నూల్: ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపర్చేందుకు కేంద్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. బడుల్లో అన్ని సౌకర్యాలు కల్పించడంతోపాటు కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దేందుకు రెండేళ్ల క్రితం ప్రభుత్వం ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైసింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం కింద ఎంపిక చేసిన పాఠశాలలను సమగ్ర అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ చేపట్టింది. ఈ మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొదటి విడతలో 69 పాఠశాలలను ఎంపిక చేసిన ప్రభుత్వం.. తాజాగా రెండో విడతలో మరో 46 పాఠశాలలను ప్రకటించింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులతో పాఠశాలలను అభివృద్ధి చేస్తుండగా.. కేంద్రం కూడా నిధులు మంజూరు చేస్తుండడంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారనున్నాయి.

ఏయే పాఠశాలలు అంటే..

నాగర్‌కర్నూల్ జిల్లాలో గతేడాది 17 పాఠశాలలను పీఎంశ్రీ కింద ఎంపిక చేయగా ఈసారి మరో పదింటిని ఎంపిక చేయడం జరిగింది. ఇందులో నాగర్‌కర్నూల్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కోడేరులోని మోడల్ స్కూల్, లింగాలలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్ సొసైటీ, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్ సొసైటీ అచ్చంపేట (బాలికల), జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల అమ్రాబాద్, జెడ్పీహెచ్‌ఎస్ తూడుకుర్తి, జెడ్పీహెచ్‌ఎస్ కొల్లాపూర్, జెడ్పీహెచ్‌ఎస్ మేడిపూర్ (తాడూరు మండలం), కేజీబీవీ కోడేరు, ఎంపీపీఎస్ కొండూరు (పెంట్లవెల్లి మండలం) పాఠశాలలు ఉన్నాయి.

మహబూబ్‌నగర్ జిల్లాలో.. అడ్డాకుల, భూత్పూర్, జక్కలపల్లి, వెన్నచేడ్, జడ్చర్ల, కోయిలకొండ, కొకుంట్ల, మహబూబ్‌నగర్ (గురుకుల), మహబూబ్‌నగర్ (బోయపల్లి) పాఠశాలలు ఎంపికయ్యాయి.

జోగుళాంబ గద్వాలలో.. మాన్‌దొడ్డి, అయిజ (బాలుర), క్యాతూర్, ధరూర్, అనంతపూర్, గద్వాల (అభ్యసన పాఠశాల), మాచర్ల, కుచినెర్ల, జల్లాపూర్, బీచుపల్లి గురుకుల పాఠశాలలకు చోటు కల్పించారు.

నారాయణపేటలో.. దామరగిద్ద, ధన్వాడ (ఆదర్శ), గుండుమాల్, మరికల్, నారాయణపేట, పాతర్చేడ్, చిన్నపొర్ల పాఠశాలలు ఉన్నాయి.

వనపర్తిలో.. జిల్లాలోని మస్తీపూర్, ఆత్మకూర్, వెలగొండ, గోపాల్‌పేట, కొత్తకోట (బాలికలు), వీపనగండ్ల (బాలుర గురుకుల), పాన్‌గల్, పెబ్బేరు (కేజీబీవీ), బునాదిపూర్, శ్రీరంగాపూర్ పాఠశాలలను ఎంపిక చేశారు.

చేపట్టే అభివృద్ధి పనులు..

కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం పీఎంశ్రీ పథకం ద్వారా నిధులు అందిస్తాయి. ఈ నిధులతో ఆయా పాఠశాలల్లో ఎల్‌ఈడీ లైట్లు, పోషకాహార వనం, ఎల్‌ఈడీ ఫ్యానళ్లు, వ్యర్థాల నిర్వహణ, సొంత భవనాలు, మరుగుదొడ్లు, నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, డిజిటల్ గ్రంథాలయాలు, క్రీడా మైదానాలు, డిజిటల్ బోధన, సైన్స్ ల్యాబ్ వంటి సదుపాయాలను కల్పించనున్నారు. అయితే ఈ పథకం ద్వారా ఒక్కో పాఠశాలకు ఏడాదికి రూ.40 లక్షల చొప్పున ఐదేళ్లపాటు నిధులు అందించనున్నారు. అయితే గతేడాది ఎంపికైన పాఠశాలలకు స్థాయిని బట్టి రూ.3- 5 లక్షల వరకు నిధులు మంజూరు చేసి ఏయే పనులకు ఖర్చు చేయాలో గైడ్‌లైన్స్ విడుదల చేసింది. ప్రస్తుతం ఈ పనులు కొనసాగుతున్నాయి. కాగా విడతల వారిగా మరిన్ని నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది.

ఆధునిక సౌకర్యాలు



పీఎం శ్రీ పథకం కింద మేడిపూర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఎంపిక కావడం సంతోషంగా ఉంది. ఈ పథకం అమలుతో విద్యార్థులకు ఉత్తమ బోధన అందించవచ్చు. విద్యార్థులకు కావాల్సిన ఆధునిక సౌకర్యాలను కూడా అందుబాటులోకి తేవచ్చు.

– ప్రేమ్‌కుమార్, హెచ్‌ఎం, జెడ్పీహెచ్‌ఎస్, మేడిపూర్

నిధులు మంజూరు..



గతేడాది పీఎంశ్రీ పథకం కింద జిల్లాలో 17 పాఠశాలలు ఎంపికవగా.. ఈసారి మరో పదింటికి చోటు కల్పించారు. గతేడాది ఎంపికైన పాఠశాలలకు రూ.5 లక్షల వరకు నిధులు వచ్చాయి. ప్రస్తుతం అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నాం. పీఎంశ్రీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుంది.

–గోవిందరాజులు, డీఈఓ, నాగర్‌కర్నూల్

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మృతుడు బీసయ్య(ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతిచెందిన సంఘటన జిల్లా కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ గోవర్ధన్ తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని 16వ వార్డుకు చెందిన బీసయ్య(50) కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇతను తన ఇంటి ముందున్న ఇనుప పైపులను ఇంటి మిద్దెపై పెట్టేందుకు తీసుకెళ్తుండగా.. పైపులు విద్యుత్ తీగలకు తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. సంఘటనకు సంబంధించి మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలియజేశారు.

చికిత్స పొందుతూ యువకుడు..

ఎర్రవల్లిచౌరస్తా: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన ఇటిక్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చాగాపురం చెందిన వడ్డే మోహన్ (24) ఆదివారం ఉదయం పని నిమిత్తం తన ద్విచక్ర వాహనంపై ఎర్రవల్లికి వెళ్లి పని ముగిసిన తర్వాత తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో చాగాపురం నాలుగు రోడ్ల సమీపంలో మధ్యాహ్నం బైక్ అదుపుతప్పి కింద పడటంతో తీవ్ర రక్త గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ పేర్కొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి..

మహబూబ్‌నగర్ క్రైం: చిత్తుకాగితాలు వేరుకుంటూ రైలు పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే ఎస్ఐ సయ్యద్ అక్బర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పెద్ద శివాలయం సమీపంలో సోమవారం మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి(40) కాగితాలు, పాత ఇనుప సామాన్లు వేరుకుంటూ భుజంపై సంచి వేసుకుని పట్టాల వెంటా నడుచుకుంటూ వెళ్తుంటే రాయచూర్ వెళ్తున్న రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి దగ్గర ఎలాంటి ఆధారాలు లేవని, మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. కుటుంబసభ్యులు ఎవరైనా ఉంటే రైల్వే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

రాజాపూర్: జడ్చర్ల మండలంలోని లక్ష్మీనారాయణతండాకు చెందిన యువకుడు ఆదివారం రాత్రి గల తిర్మలగిరితండాలో దస్రునాయక్ చెందిన మామిడితోటలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. తండాకు చెందిన చెందిన నందు(20) తోటకు నీళ్లు పట్టె పనులు చేస్తున్నాడు. కాగా అదే తోటలో గల గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు మృతుడి తండ్రి దేవేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన కుమారుడు ఆత్మహత్యపై అనుమానాలు ఉన్నాయని గతంలో తోటలో పని చేసే చోట దస్తగిరితో గొడవలు జరిగాయని అందుకు అతడి మూలంగానే తన కొడుకు మృతి చెందాడని, ఈ విషయంలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని మృతుడి తండ్రి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు.

కార్లు ఢీకొని ఆరుగురికి గాయాలు

కల్వకుర్తి రూరల్: జడ్చర్ల, కోదాడ జాతీయ రహదారిపై తాండ్ర, కొండారెడ్డిపల్లి గ్రామాల మధ్యలో సోమవారం సాయంత్రం ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొని ఆరుగురికి గాయాలు కాగా.. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. శ్రీశైలం నుంచి కల్వకుర్తి వైపు కారు వస్తుండగా.. గుంటూరు నుంచి మహబూబ్‌నగర్‌కు పాల లారీ వస్తుంది. కల్వకుర్తి వైపు నుంచి శ్రీశైలం వెళ్తున్న మరో కారును లారీ ఢీకొట్టగా.. అదే సమయంలో శ్రీశైలం నుంచి కల్వకుర్తి వైపు వస్తున్న కారు ఢీకొట్టుకున్నాయి. ఈ ఘటనలో రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలం, తాళ్లగూడతండాకు చెందిన విజయకు తీవ్ర గాయాలయ్యాయి. సాయికుమార్‌కు, మరో నలుగురికి గాయాలయ్యాయి. విజయను ప్రాథమిక చికిత్స చేయించిన అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ఎన్నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మాధవరెడ్డి తెలియజేశారు.

మృతదేహం లభ్యం

పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలోని పీజేపీ కాల్వలో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. మృతదేహాన్ని జిల్లా మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

- ఐదు రోజుల పాటు బీచుపల్లి ఆంజనేయస్వామి ఉత్సవాలు



బీచుపల్లిలో వెలసిన ఆంజనేయస్వామి



బీచుపల్లి ఆలయాల ముఖద్వారం

ఎర్రవల్లిచౌరస్తా: అపర మంత్రాలయంగా పేరుగాంచిన బీచుపల్లి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాలలో భాగంగా 21న ఉదయం పంచామృతాభిషేకం, వాస్తు పూజ హోమం, అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణము, బలిహరణ, రాత్రికి తెప్పోత్సవం, 22న ఉదయం పంచామృతాభిషేకం, స్వామి వారి ఉపనయనం, రాత్రికి ప్రభోత్సవం, 23న ఉదయం పంచామృతాభిషేకం, వ్యాసపూజ, మధ్యాహ్నం సీతారాముల కల్యాణం, బలిహరణం, సాయంత్రం రథంగ హోమం, రాత్రికి కుంభం, రథోత్సవం, 24న ఉదయం పంచామృతాభిషేకం, చౌకిసేవ, బలిహరణం, రాత్రికి ప్రభోత్సవం, 25న ఉదయం అమృతస్నానం, పంచామృతాభిషేకం, రాత్రికి పల్లకీసేవతో ఆంజనేయస్వామి ఉత్సవాలు ముగుస్తాయి.

ప్రతి రోజు పూజలు..

ఆంజనేయస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రతి రోజు ఉదయం గం.7:30 గంటలకు ఆకుపూజ, అభిషేకం నిర్వహిస్తారు. ప్రతి ఏటా జరిగే ఉత్సవాల సమయంలో నాలుగు శనివారాల్లో కూడా (నెల రోజుల పాటు) భక్తులు స్వామి వారికి దాసంగాలను సమర్పిస్తారు. ఆలయ సమీపంలో దక్షిణవాహినిగా పేరుగాంచిన పవిత్ర కృష్ణానది ఉన్నది. భక్తులు నదిలో పుణ్య స్నానాలు ఆచరించిన తర్వాతే స్వామి వారి దర్శనానికి వెళ్తారు. ప్రతి మంగళ, శనివారాల్లో కూడా భక్తులు అధికంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు చేస్తారు. ప్రతి అమావాస్య రోజు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నలుమూలల నుంచే కాక కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి కూడా వేల సంఖ్యలో భక్తులు దర్శనానికి వస్తారు. ప్రతి అమావాస్య రోజు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేపడతారు. అదేవిధంగా దేవస్థానం దగ్గర భక్తులు దాసంగాలు, వివాహాలు, సత్యనారాయణస్వామి వ్రతాలు, పుట్టు వెంట్రుకలు తీయుట, నామకరణం చేయుట వంటి కార్యక్రమాలను ఎక్కువగా చేస్తారు. వీటిని చేయుటకు అర్చకులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారు.

ఏర్పాట్లు పూర్తి..

ఆంజనేయస్వామి ఉత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించినట్లు ఆలయ ఈఓ రామన్‌గౌడ్ తెలిపారు. ఆలయ చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకుని ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. భక్తులు స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించి కృపకు పాత్రులు కాగలరని ఆయన కోరారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణమంతా విద్యుత్ దీపాలతో ముస్తాబైంది.

ఒక్కరోజే దర్శన 'యోగం'



శ్రీయోగనారసింహ స్వామి ఆలయం

- నేడు 'యోగనారసింహ స్వామి' జయంతి
- ఏడాది పొడవునా భక్తులకు దర్శనాలు కరువు
- పట్టించుకోని ఆలయ అధికారులు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ తుంగభద్ర నదీ తీరాన ఉన్న శ్రీ యోగనారసింహ స్వామివారి ఆలయంలో మంగళవారం నారసింహ స్వామి జయంతి వేడుకలు కొనసాగనున్నాయి. ఇక్కడ వెలిసిన యోగనారసింహ స్వామిని భక్తులు దర్శించుకునే భాగ్యం కలగాలంటే ఏడాదిలో ఒక్కసారి మాత్రమే, అది కూడా నారసింహ స్వామి జయంతి రోజున మాత్రమే అంటే ఆశ్చర్యం కలుగుతుంది. మిగితా రోజుల్లో ఈ ఆలయానికి ఎప్పుడూ తాళం ఉంటుంది. రికార్డుల్లో మాత్రం ఇక్కడ అర్చకుడు, క్లర్కు, స్వీపర్ ఇలా అన్ని పోస్టులు రికార్డుల్లో ఉన్నాయి. ఏడాది పొడవున నరసింహస్వామి ఆలయ నిర్వహణకు కూడా ఖర్చులు బాగానే కనిపిస్తుంటాయి. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్టు ఆలయం మాత్రం ఏ ఒక్క రోజు తెరిచి ఉండటం లేదు. ఇక్కడ పేరుకు ఒక అర్చకుడిని నియమించినా.. అతడి సేవలను ప్రధాన ఆలయంలోనే వినియోగించుకుంటున్నారు.



ఆలయంలో కొలువుదీరిన నారసింహ స్వామి

నారసింహస్వామి జయంతికి ఏర్పాట్లు..

యోగనారసింహ స్వామివారి ఆలయంలో ఈ నెల 21న స్వామివారి జయంతి నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయానికి వారం రోజుల కిందట రంగులు వేయించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, సాయంత్రం స్వామివారి కల్యాణోత్సవాలు నిర్వహిస్తారు. ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేస్తూ.. ఊరిలో టాంటాం(తప్పెట) వేయించారు.

ఏడాదికి ఒక్కసారే ఆలయం తెరుస్తారు..



ఇక్కడి యోగనారసింహ స్వామివారి ఆలయం ఎంతో బాగుంటుంది. కానీ దర్శనం చేసుకునేందుకు అవకాశం ఉండదు. ఎప్పుడు చూసినా తలుపులకు తాళం ఉంటుంది. దర్శనాలకు ఆలయం తెరిచి ఉంచాలని పలుమార్లు విన్నవించినా.. ఫలితం లేదు. ఎలాగో స్వామివారి జయంతి కాబట్టి ఆ రోజు మాత్రం తీసి ఉంచుతారు. నారసింహ స్వామిని దర్శించే యోగం ఈ ఒక్కరోజే కలుగుతుంది.
– నాగమద్దిలేటి, స్థానికుడు

టైమింగ్స్ బోర్డు కూడా ఏర్పాటు చేశాం



యోగనారసింహ స్వామి, శ్రీసూర్యనారాయణ స్వామివారి ఆలయాలు పక్కపక్కనే 50 మీటర్ల దగ్గర్లో ఉంటాయి. ఈ రెండిటికి ఒక్క అర్చకుడిని నియమించాం. ఆలయ దర్శన వేళలు తెలుపుతూ టైమిగ్స్ బోర్డు కూడా ఏర్పా టు చేశాం.
– పురేందర్‌కుమార్, ఆలయ ఈఓ

సామాన్యులకు భరోసా కల్పించాలి



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న యాదవ మహాసభ సంఘం నాయకులు

మహబూబ్‌నగర్ క్రైం: వివిధ సమస్యలతో పోలీసులను ఆశ్రయించే బాధితులకు భరోసా కల్పించాలని ఎస్పీ హర్షవర్ధన్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఫిర్యాదుదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కార మార్గం చూపాలని పోలీస్ అధికారులకు సూచించారు. సామాన్యులకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.

■ మల్లిఖార్జున వైన్స్ ఘటనలో మృతిచెందిన శ్రీకాంత్ యాదవ్ కేసులో ఏ–10గా ఉన్న బీచు రఘుపతిరెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ సోమవారం ఎస్పీ హర్షవర్ధన్‌కు అఖిల భారత యాదవ మహాసభ నాయకులు ఫిర్యాదు చేశారు. శ్రీకాంత్‌పై రఘుపతి రెడ్డి విచక్షణ రహితంగా దాడిచేసినట్లు సీసీ కెమెరాలో రికార్డు అయినప్పటికీ.. ఇప్పటి వరకు అతడిని అరెస్టు చేయలేదని ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే బీచు రఘుపతిరెడ్డి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడంతో పాటు అతడిని ప్రభుత్వ ఉద్యోగం నుంచి సస్పెండ్ చేయాలని కోరారు. లేనిపక్షంలో హెచ్‌ఆర్‌సీలో న్యాయం కోసం పోరాటం చేస్తామన్నారు.

కానిస్టేబుల్‌కు ఆర్థికసాయం

మహబూబ్‌నగర్ క్రైం: బీచుపల్లి పదవ బెటాలియన్ చెందిన హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు రెండేళ్ల నుంచి పక్షవాతంతో డ్యూటీ చేయలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంటే ఉమ్మడి ఏపీకి చెందిన 1995 బ్యాచ్ మిత్రులు కలిసి ఆర్థికసాయం అందించారు. మిత్రులు కలిసి సేకరించిన రూ.1.20లక్షల చెక్కును సోమవారం జిల్లా కేంద్రంలోని డీఐజీ కార్యాలయంలో జోగుళాంబ జోన్–7 డీఐజీ ఎల్.ఎస్ చౌహాన్ చేతుల మీదుగా చెక్కును కుటుంబ సభ్యులకు అందచేశారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సొంత కుటుంబ సభ్యులే పట్టించుకోవడం లేదని, తోటి స్నేహితులు అందరూ కలిసి ఆర్థికంగా ఆదుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్స్ శ్రీనివాసులు, ఇంతియాజ్, రాంగోవర్ధన్, గోపాల్, నజీర్ పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న డీఐజీ ఎల్.ఎస్ చౌహాన్

నేత్రదానం గొప్పది

వంగూరు: అన్ని దానాల కంటే నేత్రదానం గొప్పదని శాంత బయోటెక్ చైర్మన్, పద్మభూషణ్ అవార్డు గ్రహీత డా.వరప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం వంగూరు మండలం డిండిచింతపల్లిలో శంకర నేత్రాలయ ఆస్పత్రి, ఇందుర్తి కుటుంబ సభ్యులు సంయుక్తంగా నిర్వహించిన కంటి వైద్య శిబిరాన్ని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎంత ఉన్నత స్థానంలో ఉన్నా.. ఇతరులకు సహాయం చేయాలనే గుణం ఉండాలన్నారు. ముఖ్యంగా ఆరోగ్యానికి సంబంధించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. కాగా, వైద్యశిబిరం వారం రోజులపాటు కొనసాగుతుందని ఆర్‌అండ్‌బీ ఈఎస్‌సీ గణపతిరెడ్డి తెలిపారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారికి అవసరమైన కళ్లద్దాలను ఉచితంగా ఇవ్వడంతో పాటు గ్రామంలోనే కంటి ఆపరేషన్ చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డా.బాలవర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ సరిత, ఎంపీటీసీ సాయిలు, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వరప్రసాద్‌రెడ్డి

దాడి ఘటనపై కేసు నమోదు

బల్మూర్: ప్రేమ పెళ్లి చేసుకున్నారనే కోపంతో ఠాణాలో ప్రేమికులపై బంధువుల దాడి ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాల్‌రాజు తెలిపారు. మండలంలోని పోలిశెట్టిపల్లికి చెందిన లావణ్య గత నెల 19న తాను ప్రేమించిన వ్యక్తి ఎలకొండ కుర్మయ్యను ప్రేమ వివాహం చేసుకోగా, సోమవారం లావణ్యను తల్లిదండ్రులు వస్కుల పార్వతమ్మ, పర్వతాలు, గ్రామస్తులు పెళ్లి విషయంతో పాటు కుటుంబ ఆస్తి విషయాలు మాట్లాడుదామని బల్మూర్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. కాని ప్రేమ వివాహం చేసుకున్న లావణ్య, కుర్మయ్య పోలీస్‌స్టేషన్ గేట్ దాటిన వెంటనే ఒక్కసారిగా బంధువులంతా కలిసి వారిపై విచక్షణ రహితంగా దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బెట్టింగ్ రాయుళ్ల అరెస్టు

గద్వాల క్రైం: ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లపై కొందరు యువకులు ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా బెట్టింగ్ కాస్తున్నట్లు గుర్తించి నలుగురిని సోమవారం పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. పట్టణ శివారులోని పిల్లిగుండ్ల కాలనీతో పాటు శివారు ప్రాంతాల్లో గద్వాలకు చెందిన అనిల్‌కుమార్, ఈశ్వర్, వడ్డెపల్లికి చెందిన రాకేష్, నాగరాజు కొన్ని రోజులుగా క్రికెట్ బెట్టింగ్ ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా పందెంలు కాస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి సమాచారం మేరకు అదుపులోకి తీసుకుని వారి నుంచి నాలుగు సెల్‌ఫోన్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఇందులో మరికొంత మంది వ్యక్తులు సైతం ఉన్నట్లు వారిని సైతం త్వరలో అదుపులోకి తీసుకుంటామన్నారు. ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లో ఓ వ్యక్తి రూ.40 నుంచి రూ.60లక్షల వరకు పందెంలు వేసి అప్పులో ఉన్నట్లు సమాచారం. తన ఆస్తులను కుదవ పెట్టి బెట్టింగ్‌లో పాల్గొన్నట్లు తెలిసింది. ఆ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకే ఈ ఘటన వెలుగులోకి వచ్చినట్ల విశ్వసనీయ సమాచారం. ఈ క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంలో ప్రముఖులు ఉన్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుర్తించారని తెలిసింది.

వ్యవసాయ మోటార్లు చోరీ



చోరీకి పాల్పడిన మోటార్ల ప్రదేశం

మాగనూర్: మండల కేంద్రానికి చెందిన ఇద్దరు రైతులకు సంబంధించిన మూడు వ్యవసాయ మోటార్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. రైతులు తెలిపిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మాగనూర్‌కు చెందిన ఉదయ్‌కుమార్, వాకిటి శ్రీనివాసులుకు గ్రామ సమీపంలోని తమ వ్యవసాయ పొలం వద్ద మూడు బోరు మోటార్లు ఉన్నాయి. వాటిని సోమవారం తెల్లవారుజామున కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ట్రాక్టర్‌పై చోరీకి పాల్పడినట్లు స్థానిక గొర్లకాపారులు గుర్తించారు. అయితే వారు అక్కడికి వచ్చేలోపు పారిపోయినట్లు తెలిపారు. చోరీకి గురైన మోటార్ల విలువ సుమార్ రూ.80 వేల వరకు ఉంటుందని సంబంధిత రైతులు తెలియజేశారు. వారం రోజులుగా మండల పరిధిలో వరుస చోరీలు జరుగుతున్నా.. స్థానిక పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారి వెంట సీసీ కెమెరాలు కూడా పనిచేయడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

రామన్‌పాడుకు 267 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో నీటి మట్టం తగ్గుతుంది. సోమవారం 1,012 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. సమాంతర కాల్వ ద్వారా 267 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. తాగు నీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్ రెడ్డి తెలియజేశారు.

ట్రాక్టర్ బోల్తా : యువకుడి దుర్మరణం

కృష్ణా: ట్రాక్టర్ బోల్తాపడిన ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈఘటన కృష్ణా మండలం అనంపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. అనంపల్లికి చెందిన బస్వరాజ్ (24) ట్రాక్టర్‌తో వ్యవసాయ పనులను పూర్తిచేసుకొని ఇంటికి వస్తుండగా.. మార్గ మధ్యంలో అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో బస్వరాజ్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ నవీద్ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో రూ.3లక్షల నష్టం

గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో రూ.3లక్షల ఆస్తినష్టం జరిగిన ఘటన గద్వాల పట్టణంలో సోమవారం చోటుచేసుకుంది.బాధితుడు కథనం మేరకు.. గద్వాల పట్టణానికి చెందిన బుచ్చన్న కొంతకాలంగా బార్బర్ దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందుతున్నాడు. సోమవారం రాత్రి 9 గంటల సమయంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతం సంభవించింది. ఈ ప్రమాదంలో దుకాణంలోని పలు వస్తు, సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం ఏర్పడలేదు.

జాతీయ స్థాయి పరుగుపందెంలో గోల్డ్‌మెడల్

మక్తల్: మండలంలోని కాట్రేవ్‌పల్లికి చెందిన నరేష్, జాతీయ స్థాయి పరుగు పందెం పోటీల్లో మొదటి బహుమతి దక్కించుకున్నాడు. ఢిల్లీలో అండర్ 17 విభాగం 800 మీటర్ల పరుగుపందెంలో జాతీయ స్థాయిలో, వరంగల్ అగ్నివీర్ డెఫెన్సి అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల్లో మొదటి స్థానం దక్కించుకున్నాడు. నరేష్ పదో తరగతి వరకు మహబూబ్‌నగర్‌లో చదివాడు. ఇంటర్ నారాయణపేట ప్రైవేట్ కాలేజీలో పూర్తి చేశాడు. మే 18 నుంచి 21వరకు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన యువకులతో పోటిపడి తన సత్తా చాటినట్లు చెప్పారు. తల్లిదండ్రులు మాలమణెమ్మ, మాలరవి, నరేష్‌ను నారాయణపేట జిల్లా పరిషత్ చైర్మన్ వనజ, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, ఎంపీపీ వనజ, ఎంపీటీసీ సుజాత గ్రామస్తులు అభినందించారు.



జాతీయస్థాయిలో మొదటి బహుమతి అందుకుంటున్న నరేష్

క్రికెట్ మైదానం అభివృద్ధికి కృషి



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలో క్రికెట్ మైదానం అభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎండీసీఏ మైదానంలో ఆదివారం ఏర్పాటుచేసిన వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రికెట్ మైదానం విస్తరణకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేస్తే, హెచ్‌సీఏ నుంచి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. ఇప్పటికే హెచ్‌సీఏ అధ్యక్షుడితో మాట్లాడినట్లు చెప్పారు. క్రికెట్ మైదానం అభివృద్ధికి బీసీసీఐ సహకారం కూడా తీసుకుంటామన్నారు. క్రికెట్‌లో మహబూబ్‌నగర్ క్రీడాకారులు చరిత్ర సృష్టించాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్ మాట్లాడుతూ నెల రోజులపాటు ఉమ్మడి జిల్లాలోని ఆరు ప్రాంతాల్లో క్రికెట్ శిక్షణ శిబిరాలు నిర్వహించినట్లు చెప్పారు. హెచ్‌సీఏ ఆధ్వర్యంలో నాలుగు చోట్ల అకాడమీలు ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని.. జిల్లా కేంద్రంలో ఒకటి ఏర్పాటుచేసేలా కృషి చేయాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో టీఎన్‌జీఓ మాజీ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, ఎండీసీఏ చీఫ్ ప్యాట్రన్ మనోహర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు వెంకటరామారావు. సురేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, కృష్ణమూర్తి, చంద్రకుమార్‌గౌడ్, కోచ్‌లు గోపాలకృష్ణ, అబ్దుల్లా, మన్నాన్, అబిద్, కౌన్సిలర్లు మోతీలాల్, నర్సింలు, గట్టు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

లారీ డ్రైవర్‌పై గుర్తుతెలియని వ్యక్తుల దాడి

కొత్తకోట రూరల్: లారీని రోడ్డు పక్కకు నిలిపి, కాలకృత్యాలు తీర్చుకుని వచ్చి లారీ ఎక్కుతున్న డ్రైవర్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేయడంతో సదరు లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కడుకుంట్ల ఎన్‌హెచ్ 44పై ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. లారీ డ్రైవర్ మురుగన్ ఆదివారం రాత్రి తన లారీలో ఫర్నీచర్ లోడ్ తీసుకుని హైదరాబాద్ నుంచి బెంగళూర్‌కు బయలుదేరాడు. కడుకుంట్ల స్టేజీ సమీపంలోకి రాగానే సుమారు రాత్రి ఒంటిగంట సమయంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు లారీని రోడ్డు పక్కకు నిలిపాడు. ఆ తర్వాత లారీ ఎక్కుతున్న సమయంలో, అప్పటికే కాపుకాసిన ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు మురుగన్‌పై దాడి చేశారు. అటుగా వెళ్తున్న వాహనదారులు వెంటనే స్పందించడంతో దాడికి పాల్పడుతున్న వ్యక్తులు అక్కడి నుంచి పారిపోయారు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వెంటనే అంబులెన్స్‌ను పిలిపించి క్షతగాత్రుడిని వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలియజేశారు.